క్లుప్తంగా

నరసన్న ఆలయానికి భక్తుల తాకిడి

మధురపూడి: కోరుకొండలో వెలసిన స్వయంభూ శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాని సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. కార్తిక మాసం చివరిరోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాలకు చెందిన భక్తులు కూడా వచ్చారు. కొండపైన ఆలయంలో పూజలు, రాత్రి వేళల్లో దీపోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్య క్రమంలో సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా బొడ్డు వెంకటరమణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న దృశ్యం

రాజానగరం: పాలచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) వద్ద హెచ్ఐవీ వ్యాధి గ్రస్తులకు సోమవారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పీహెచ్సీ వైద్యులు బిటానిక్, రవికిరణ్ సహకారంతో చైల్డ్ ఫ్రెండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో 10 మందికి పౌష్టికాహారాన్ని అందించారు. ఈ వ్యాధి సోకిన వారు మనోధైర్యంతో జీవిత కాలాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆళ్ల శివ నాగరాజు, సాన కృష్ణార్జునుడు, శ్రావణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మూడు అర్జీలు వచ్చాయి. సోమవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.భారతి, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌లు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రఘుదేవపురానికి చెందిన మాదంపూడి ముసలయ్య కోపరేటివ్ విషయంలో కోర్టుకు వెళ్లినందుకు నారే ప్రసాద్ దాడికి దిగుతున్నాడని అర్జీ అందించాడు. అలాగే ముగ్గళ్లకు చెందిన ఈతకోట గణేష్ బైయిల్‌పై వచ్చి తనను బెదిరిస్తున్నాడని బేదంపూడి హరీష్ అధికారులకు అర్జీ అందించాడు. సీతానగరానికి చెందిన దివ్యాంగుడు అంచూరి శ్రీనివాస్‌కి ట్రై సైకిల్ కావాలని ఆర్జీ పెట్టుకున్నాడని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ మూర్తితోపాటుగా వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి



ఏపీఎం అరుణ

పెదపూడి: ప్రభుత్వం అందజేస్తున్న మహిళల సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడానికి కృషి చేస్తానని ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏపీఎం వి.అరుణ తెలిపారు. ఆమె సోమవారం వెలుగు కార్యాలయంలో మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, సౌకర్యాలు వినియోగించుకుని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. మహిళా సమాఖ్య అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఉన్నతాధికారుల ఆదేశాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భారతీయ సంస్కృతిని కాపాడుకోవాలి



వ్యక్తిత్వ వికాస సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను యువత పాటించి ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. అనపర్తి జీబీఆర్ విద్యాసంస్థల సమావేశ మందిరంలో సోమవారం అనపర్తి రామకృష్ణా సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస సదస్సుకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలన్నారు. రాజమహేంద్రవరం రామకృష్ణా మఠం ప్రతినిధి స్వామీ సేవ్యానందాజీ మహరాజ్ మాట్లాడుతూ సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని జీవితంలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కడప రామకృష్ణామఠం ప్రతినిధి స్వామీ సన్నివాసానందాజీ మహరాజ్ మాట్లాడుతూ వివేకనందుని ప్రభావంతో ఎందరో మహనీయులుగా మారారన్నారు. స్థానిక సేవా సమితి అధ్యక్షుడు పడాల సుబ్బిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు జీబీఆర్ కళాశాలల విద్యార్థులు, ఎన్డీఏ నాయకులు, రామకృష్ణ సేవాసమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

పంట మార్పిడి.. అధిక రాబడి

- రోగకారక కీటకాల కట్టడికి ఎంతో మేలు
- భూసారం వృద్ధి
- ఒకే తరహా సాగుతో రైతుకు నష్టం
- వైవిధ్యం చూపితే ప్రయోజనాలు అధికం



చంద్రేడులో ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము పంట



రెండో పంటగా ట్రాక్టర్‌తో శనగ విత్తనాలు నాటుతున్న రైతు

రంగంపేట: పొలంలో వేసిన పంటనే మళ్లీ వేయడం వలన దిగుబడులు తగ్గడంతో పాటు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. అలా కాకుండా ఏటా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఒకే రకం కాకుండా అనేక రకాల పంటలను క్రమపద్ధతిలో సాగుచేస్తే అధిక ప్రయోజనాలు పొందవచ్చునని చెబుతున్నారు. పంట మార్పిడి చేయడం ద్వారా ప్రకృతి వనరులను సైతం సమర్ధవంతంగా వినియోగించుకోవచ్చు. తక్కువ పెట్టుబడితో భూసారానికి నష్టం కలగకుండా అధిక దిగుబడులు సాధించవచ్చు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి వాతావరణం అనుకూలించడంతో ఖరీఫ్ సాగు చేసిన రైతులంతా పంటను ఒబ్బిడి చేసుకున్నారు. రెండవ పంటకు సిద్ధమవుతున్న అన్నదాతలు పంట మార్పిడి ఆవశ్యకతపై అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉంది.

ఏటా ఒకే రకం పంట పండించడం వల్ల చీడపీడలు, కలుపు బెడద ఎక్కువగా ఉంటుంది. పైరు కూడా అభివృద్ధి చెందదు. దిగుబడులు సైతం తగ్గుతాయి. రైతులకు పెట్టుబడి భారం పెరుగుతుంది. వేరు వ్యవస్థ ఒకే లోతుకు పోవడం వల్ల నేలలో ఆ లోతు వరకు ఉన్న పోషకాలను మాత్రమే మొక్కలు వినియోగించుకుంటాయి. నేల కోతకు గురవుతుంది. పండిన పంట నాణ్యతగా ఉండదు. ఫలితంగా గిట్టుబాటు ధర లభించదు. దీంతో రైతులకు నష్టం వచ్చే అవకాశం ఉంది. మార్కెట్ సమస్యలు కూడా ఎదురవుతాయి. ఎక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు, తక్కువ లోతుకు వేర్లు వెళ్లే పైర్లు ఒకదాని తరువాత ఒకటి సాగు చేయాలి. ఉదాహరణకు జొన్న-పత్తి. నేలను నిర్వీర్యం చేసే పంటలను, సారాన్ని అభివృద్ధి చేసే పంటలను ఒకదాని తరువాత ఒకటి సాగు చేసుకోవాలి.

వరిపంట సాగుచేసే ముందు పచ్చిరొట్ట పైర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరిగి సేంద్రియ పదార్థం భూమిలో ఎక్కువగా ఉండటం వల్ల పైరు ఏపుగా పెరుగుతుంది. వరి తరువాత అపరాలు లాంటి పైర్లు సాగు చేయడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం బాగా వృద్ధి చెందుతుంది. దీంతో పంటపై వచ్చే శిలీంద్రాల ఉధృతి తగ్గుతుంది. వరి తరువాత గింజ జాతికి చెందిన శనగ, పెసర, మినుము, వేరు శనగ లాంటివి సాగు చేయడం వల్ల వాటి వేర్లలోని రైజోబియన్ బ్యాక్టీరియా గాలిలోని నత్రజనిని తీసుకుంటుంది. వేర్లలో బుడిపెల మాదిరిగా ఏర్పడి తరువాత సాగు చేసే పంటలకు మంచి సారాన్ని అందిస్తాయి.

ఆశాజనక దిగుబడులు



ఏటా ఒకే రకం పంట సాగు చేయకుండా పంట మార్పిడి పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుతం చాలా మంది రైతులు తమ పొలాల్లో ఒకే రకం పంటను తరచూ సాగు చేస్తున్నారు. నీటి పారుదల ఉన్నచోట వరి తప్ప ఇతర పంటలు వేయడం లేదు. దీంతో వరిలో చీడపీడల బెడద ఎక్కువై సాగు ఖర్చులు పెరుగుతున్నాయి. దీన్ని నివారించుకునేందుకు పంట మార్పిడి విధానం చాలా ఉత్తమం. రైతులంతా విధిగా పంట మార్పిడి చేపట్టాలి.

కె. శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి, రంగంపేట మండలం.

ఘనంగా షిర్డీసాయి ఆలయ వార్షికోత్సవం



పూజలందుకున్న సాయిబాబా

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలో రావిచెట్టు వద్ద ఉన్న షిర్డీసాయి ఆలయ 25వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముందుగా గణపతి పూజ, పాలభిషేకం, హారతులు, భజనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి బాబా దర్శనం చేసుకున్నారు. అనంతరం భారీ ఎత్తున అన్న సమారధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల శ్రీనివాస్, కంచర్ల గణేష్, ముల్లువలస శివ తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి కల్యాణానికి ఏర్పాట్లు

ఈనెల 7వ తేదీ నుంచి కోరుకొండ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి ఉత్సవాలు



షష్ఠ ఉత్సవాలకు సిద్ధమైన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

మధురపూడి: కోరుకొండలో వెలసిన శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠిమహోత్సవాలు వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఈ మేరకు ఆలయాన్ని, స్వామి, అమ్మవార్లను సిద్ధం చేస్తున్నారు. ఈనెల ఏడో తేదీ నుంచి 12వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 71వ సంవత్సరం ఉత్సవాలు జరగనున్నాయి. దీనిలో భాగంగా మొదటి రోజు ఏడో తేదీ రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం మోపర్తి వెంకట కృష్ణ దంపతుల మీదుగా జరుగుతుంది. అనంతరం వీరభద్రుని సంబరం, 11న ఉదయం 9 గంటలకు 108 మంది దంపతులచే శాంతికల్యాణం, 12న స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. ఈ ఆరురోజులు సంగీత విభావరి, సినీ మ్యూజికల్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి.

భద్రత కట్టుదిట్టం

షష్ఠి ఉత్సవాల సందర్భంగా భద్రతను కట్టుదిట్టం చేసినట్టు కోరుకొండ సీఐ సత్యకిషోర్ తెలిపారు. సోమవారం ఆయన ఉత్సవాలు నిర్వహించే ప్రదేశాన్ని, ఆలయం పరిసరాలను పరిశీలించి, ఆలయ అభివృద్ధి కమిటీతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ నేపథ్యంలో ఆలయాభివృద్ధి కమిటీకి పలు సూచనలు చేశారు. వాహనాల పార్కింగ్, భక్తుల రద్దీ నేపథ్యంలో చోరీలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు.

దివాన్‌చెరువులో షష్ఠి ఉత్సవాలు ప్రారంభం

రాజానగరం: దివాన్‌చెరువులో విశ్వేశ్వరీదేవి ఆలయంలో కొలువై ఉన్న బాలకుమారస్వామి షష్ఠి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. మార్గశిర మాసంలో వచ్చే షష్ఠి కి ఆరు రోజులు ముందుగానే ఇక్కడ ఉత్సవాలను ప్రారంభించి, షష్ఠికి ముగిస్తారు. ఈ ఆరు రోజులు ఉదయం అభిషేకాలు, సాయంత్రం పూజలు జరుగుతాయని నిర్వాహకులు డాక్టర్ కె.రాంబాబు తెలిపారు.

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామంలో నిర్వహించే షష్ఠి ఉత్సవాల పనులను రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ భవ్యకిషోర్ పరిశీలించారు. ఈ నెల 6 నుంచి 12వరకు జరిగే కుమర సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలను పురస్కరించుకుని జరిగే పనులపై ఆరా తీశారు. ట్రాఫిక్ మళ్లింపు, బాణాసంచా కాల్చే ప్రదేశాలు, భక్తుల క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి, కమిటీ సభ్యులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అనపర్తి సీఐ సుమంత్, ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్, షష్ఠి ఉత్సవ కమిటీ చైర్మన్ పల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



సీతానగరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సీతానగరం: స్థానిక కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో శ్రీరామకృష్ణ మఠం, వేమగిరికి చెందిన పరమహంస యోగానంద కంటి ఆసుపత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరంతోపాటుగా కంటి వైద్యశిబిరాన్ని సోమవారం నిర్వహించారు. సీతానగరం కస్తూర్బాగాంధీ ఆశ్రమంలో డాక్టర్ సత్యం రమేష్‌బాబు, డాక్టర్ రాయుడు శ్రీనివాస్ 280 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. శ్రీరామకృష్ణ మఠం ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 215 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 9 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించి ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ ప్రతినిధి జి.సుశీల, యన్నమని వెంకట నారాయణ, ఎస్.నరసింహం, వై.రవీంద్రబాబు, ఎస్.జగపతి రాజు, ఘంటా నరసింహమూర్తి, పి.ఈశ్వరుడు, కె.శ్రీనివాస్, చంటిబాబు పాల్గొన్నారు.

విశ్వరూప సందర్శన యోగం గ్రంథావిష్కరణ



విశ్వరూప సందర్శన యోగం గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆత్మజ్ఞాన ప్రబోధకులు వివేకానంద

బిక్కవోలు: భగవద్గీత విశ్వరూప సందర్శన యోగం గ్రంథాన్ని ట్రూత్ స్పిరిట్యువల్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు, ఆత్మ జ్ఞాన ప్రబోధకులు వివేకనంద ఆవిష్కరించారు. సోమవారం మండలంలోని బలభద్రపురం గ్రామంలోని ఎంఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ట్రూత్ వివేకామృతం ఆధ్యాత్మిక విజయోత్సవ వేడుకలు మూడో రోజు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా వివేకనంద మాట్లాడుతూ ఈ లోకంలో ఏది పొందినా అది శాశ్వతం కాదన్నారు. ఆధ్యాత్మిక జ్ఞానం ఒక్కటే మనతో పాటు ఉండే శాశ్వత ఐశ్వర్యమని పేర్కొన్నారు. ఆయన రచించిన భగవద్గీత విశ్వరూప సందర్శన యోగం గ్రంథం గురించి వివరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన సాధకులు హాజరయ్యారు.

శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు



బూరుగుపూడి వీరేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకస్వామి, భక్తులు



ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న పండితులు

మధురపూడి: కార్తికమాసం చివరి సోమవారం కావడంతో శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. కోరుకొండ మండలంలోని శివాలయాల్లో అభిషేకాలు, పూజలు జరిగాయి. బూరుగుపూడి భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ధర్మ కర్త క్రొవ్విడి సత్రాజు ఆధ్వర్యంలో నెలంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాడాల కాశీవిశాలక్షి సమేత విశ్వేశ్వరస్వామి, కాపవరం అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, కణుపూరు శ్రీభ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయాలు భక్తులు కిటకిటలాడాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాల వితరణ చేశారు.

బాబా ఆలయంలో పూర్ణాహుతి

కార్తిక మాసం చివరిరోజు సందర్భంగా కోరుకొండ మండలం బూరుగుపూడి బాబా ఆలయంలో సోమవారం పూర్ణాహుతి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ గురువు మామిడిపల్లి రామారావు ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించారు. ఈ హోమం స్థానిక చెరుకూరి సత్యనారాయణ, మంగాయమ్మ దంపతులతో నిర్వహించారు. ఉదయం బాబాకు 108 లీటర్ల పాలతో అభిషేకం చేసి అనంతరం ఈ పూర్ణాహుతి చేశారు. ఈ సందర్భంగా జరిగిన భారీ అన్నసమారాధనకు భక్తులు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా బాబావారి శాలువాలను భక్తులు వేలం ద్వారా తీసుకున్నారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, కందుల బాబారావు, కంటే నాగకేశవరావు, కంటే చత్యసత్ర గణపతి, గూడపాటి వెంకటేశ్వరరావు, మూతిన శివమోహన్ పాల్గొన్నారు.

వైభవంగా 'పోలి' దీపోత్సవం



రాజానగరంలోని రావుల చెరువులో దీపాలు వదిలి పూజలు చేస్తున్న మహిళలు

రాజానగరం: పోలి పాడ్యమి సందర్భంగా స్థానిక రావుల చెరువు వద్ద సోమవారం తెల్లవారు జామున దీపోత్సవం వైభవంగా జరిగింది. కార్తిక మాసం ముగిసి, మార్గశిర మాసం ప్రవేశించడంతో తొలిరోజును పోలి పాడ్యమిగా జరుపుకొంటారు. మహిళలు తెల్లవారు జామునే లేచి, చన్నీటి స్నానమాచరించి, దగ్గరలో ఉన్న నదులు, చెరువులలో దీపాలను వెలిగించి, అరటి డొప్పల్లో ఉంచి నీటిలో వదిలిపెట్టడం సంప్రదాయం. ఈ ప్రకారంగా 30 ఒత్తులతో దీపారాధనలు చేసి, నీటిలో వదలి శివ నామస్మరణతో భక్తి పూర్వకంగా వాటికి నమస్కారించారు.

సాగునీటి సంఘాల ఎన్నికల విధులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సీతాపతిరావు

పెదపూడి: త్వరలో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ పీవీ.సీతాపతిరావు సూచించారు. పెదపూడిలో సోమవారం వీఆర్వోలు, సచివాలయ అధికారులకు ఎన్నికల విధుల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి కృషి చేయాలన్నారు. మండలంలో ఏడు సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలో ఏపీత్రయం, కరకుదురు, పెదపూడి, పెద్దాడ, సంపర, జి.మామిడాడ, గండ్రేడు సాగునీటి సంఘాలకు పర్యవేక్షణ అధికారులను నియమించారన్నారు. డ్రెయినేజీ డీఈ రవికిరణ్ ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంఈఓ సీవీవీ.సత్యనారాయణ, ఏఓ సీహెచ్ సత్యనారాయణరెడ్డి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ ఏఈలు శ్రీనివాసు, గంగాధర్, నాగభూషణం, ఈఈ దుర్గాభవాని, వీఆర్వోలు గొల్లపల్లి అంజిబాబు, కరెడ్ల రమేష్ బాబు, ఏడుకొండలు, పంపన శ్రీను, సునీత, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్తికం.. పరిసమాప్తం

- కాలువ రేవుల్లో పోలిస్వర్గం పూజలు
- శివాలయాల్లో అభిషేకాలు



శివుని వివిధ ఆకృతులతో రూపొందించిన చిత్రం చుట్టూ వెలిగించిన కార్తిక దీపాలు



ఓం నమఃశ్శివాయ ఆకృతిలో వెలిగించిన దీపాలు

బిక్కవోలు : కార్తికమాసం ముగింపు సందర్భంగా సోమవారం తెల్లవారు జామున పోలమ్మ (పోలి) పూజలను మహిళలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామున 3 గంటల నుంచి కాలువ రేవులు మహిళలతో పోటెత్తాయి. పుణ్యస్నానాలు చేసి కార్తిక దీపాలను వెలిగించి నీటిలో వదిలారు. రావిచెట్టు, తులసికోటల వద్ద పూజలు చేశారు. బ్రాహ్మణులు చెప్పిన పొలి కథను విని వారికి స్వయంపాకం దానం చేసి వారి ఆశీస్సులు అందుకున్నారు. పందలపాకలో శ్రీకాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్దకు వచ్చిన భక్తులకు గ్రామానికి చెందిన పడాల వీరవెంకట సత్యనారాయణరెడ్డి, విజయపద్మావతి దంపతులు పులిహోర ప్రసాదం అందజేశారు. గౌరిశంకర ఆలయంవద్ద వచ్చిన భక్తులకు సిరపరపు అప్పారావు, దుర్గ దంపతులు ప్రసాదం అందజేశారు. బిక్కవోలు గోలింగేశ్వరస్వామి, బలభద్రపురం ఉమా రామలింగేశ్వరుడు, ఊలపల్లి వేణుగోపాల స్వామి, ఆగేస్త్యేశ్వరస్వామి, కొంకుదురు బుడితలమామిడి వద్ద త్రిముంఖగేశ్వరుడి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

నేత్రపర్వంగా కార్తిక దీపోత్సవం

రంగంపేట: కార్తికమాసం చివరి రోజు చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయనీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయం శోభాయమానంగా మారింది. స్వామివారి సన్నిధిలో నిర్వహించిన దీపోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తి శ్రద్ధలతో దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. చంద్రశేఖర స్వామికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో స్వామివారి వివిధ రూపాలతో వేసిన ఆకృతుల చుట్టూ భక్తులు వెలిగించిన దీపాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



పందలపాకలో గౌరీశంకరుడి ఆలయం వద్ద పోలి కథ వింటున్న భక్తులు



పందలపాక-కొంకుదురు కాలువలో దీపాలు వదులుతున్న భక్తులు

అవసరం లేని యాప్‌లను వినియోగించొద్దు

బిక్కవోలు: అవసరం లేని యాప్‌లు ఓపెన్ చేయొద్దని అనపర్తి సీఐ సుమంత్ అన్నారు. సోమవారం మండలంలోని బిక్కవోలు శ్రీ ప్రజ్ఞ జూనియర్ కళాశాల విద్యార్థులతో మహిళా రక్షక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ కొందరు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంలో లేనిపోని యాప్‌లు ఓపెన్ చేస్తున్నారన్నారు. దీనినే సైబర్ నేరస్తులు అవకాశంగా తీసుకుంటున్నారని అన్నారు. ఎవరికీ ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్, కళాశాల కర్స్పాండెంట్ ఓదూరి శ్రీను పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి

పెదపూడి: గ్రామాల్లో పారిశుధ్యాన్ని మరింత మెరుగుపర్చడానికి సచివాలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. జి.మామిడాడ గ్రామంలో మురుగు కాలువల్లో పూడిక, చెత్త తొలగింపు చర్యలను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతా కార్యక్రమాలు చేపడితే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లోని ప్రధాన రహదారుల వద్ద చెత్త కుప్పలను తొలగించి బ్లీచింగ్ చేయాలన్నారు. ఆయన వెంట సచివాలయ కార్యదర్శి నాగేంద్ర, ఆరోగ్యశాఖ సిబ్బంది శారద తదతరులు పాల్గొన్నారు.